పనిలో పెట్టిస్తామంటూ డబ్బులు వసూలు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 14: మంచిర్యాల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిలో వయసు పైబడిన ఎనిమిది మంది స్థానంలో వారి కుటుంబ సభ్యులకే పనులు పెట్టిస్తామని డబ్బులు వసూలు చేసిన ఘటన చర్చనీయాంశమైంది. ఎనిమిది మంది వయసు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకే పనులు కల్పించాలం టే రూ. 50 వేల చొప్పున ఇవ్వాలని ఓ కార్మిక సంఘం నాయకులు చెప్పగా, అందుకు ఒప్పుకున్న వారు ఆ మొత్తాన్ని సదరు కార్మిక సంఘం నాయకునికి అందించారు. తొమ్మిది నెలలైనా తమకు పనులు కల్పించడం లేదని నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. డబ్బులు వసూలు చేసిన కార్మిక సంఘం నాయకుడిని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు తిరిగి ఇవ్వాలని కోరగా, తనకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండడం కోసం అధికార పార్టీ కౌన్సిలర్‌ను వారు ఏర్పాటు చేసుకున్న కొత్త సంఘానికి నాయకునిగా పెట్టుకున్నారు. ఇదే సమయంలో మరో కార్మిక సంఘం నాయకులు డబ్బులు ఇచ్చిన ఎనిమిది మంది కార్మికులకు తగిన న్యాయం చేయాలంటూ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యను కోరారు. బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారు.

గృహజ్యోతికి వివరాలివ్వాలి

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 14 : గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు తమ వివరాలను సమీపంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో అందజేయాలని మంచిర్యాల ఏడీఈ రేగుంట స్వామి తెలిపారు. తెలుపు రంగు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలనలో అందించిన దరఖాస్తు రశీదు, కరెంటు బిల్లు రశీదులను వెంట తీసుకుని రావాలని కోరారు. మంచిర్యాల పట్టణంలో టౌన్ 1 పరిధిలోకి వచ్చే వినియోగదారులు రాంనగర్ సబ్ స్టేషన్‌లో, టౌన్ 2 పరిధిలోకి వచ్చే వినియోగదారులు ఏసీసీ సబ్‌స్టేషన్‌లో, టౌన్ 3 పరిధిలోకి వచ్చే విద్యుత్ వినియోగదారులు రైల్వేగేటు బిల్లు కౌంటర్ వద్ద తమ వివరాలను అందజేయాలని తెలిపారు.

ఒకరి రిమాండ్

దండేపల్లి/జన్నారం, ఫిబ్రవరి14 : తాళ్లపేట రేంజ్ పరిధిలోగల తపాల్‌పూర్ బీట్‌లో అక్రమంగా టేకు చెట్లను నరికి రవాణా చేసినందుకు జన్నారం మండలం మల్యాల గ్రామానికి చెందిన మోడితె నర్సయ్యను 14 రోజులు లక్షెట్టిపేట జైల్‌కు రిమాండ్‌కు తరలించినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి సుష్మారావు బుధవారం తెలిపారు. ఫారెస్టు సెక్షన్ అధికారులు గోపికృష్ణ, యాదమ్మ, బీట్ అధికారి లాల్‌బాయి, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

భర్తపై గొడ్డలితో దాడి

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 14: పట్టణంలోని బెల్లంపల్లి బస్తీకి చెందిన బూర్గు లత బుధవారం తన భర్త శంకర్‌పై గొడ్డలితో దాడి చేసింది. కొంత కాలంగా కుటుంబ కలహాలతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. బుధవారం జరిగిన గొడవ ఈ ఘటనకు దారితీసింది. గాయపడ్డ బూర్గుశంకర్ పరిస్థితి విషయంగా మారడంతో కరీంనగర్‌లోని దవాఖానకు తరలించారు.

భార్య, కొడుకుపై హత్యాయత్నం

కాసిపేట, ఫిబ్రవరి 14 : కోమటిచేను గ్రామానికి చెందిన గెడం వసంత, తన కొడుకుతో కలిసి బుధవారం ఉదయం రేకుల షెడ్డులో నిద్రిస్తుండగా, తన భర్త వెంకటేశ్వర్ డీజిల్ పోసి నిప్పుపెట్టి చంపే యత్నం చేశాడని భార్య వసంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోటపల్లి, ఫిబ్రవరి 14 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏవో మహేందర్ అన్నారు. బుధవారం కొల్లూరు, రాంపూర్ గ్రామాల్లో యువకులతో సమావేశం నిర్వహించారు. గుట్కా, గంజాయి, తంబాకు, ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమన్నారు. పంచాయతీ కార్యదర్శులు మధుకర్, శ్యామల పాల్గొన్నారు.

పనులు సక్రమంగా నిర్వహించాలి

వేమనపల్లి, ఫిబ్రవరి 14 : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. బుధవారం నాగారం, జిల్లెడ, సూరారం గ్రామాల్లో పర్యటించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

వైభవంగా వసంత పంచమి

- సామూహిక అక్షరాభ్యాసాలు
- సరస్వతీ చిత్ర పటాల వద్ద ప్రత్యేక పూజలు

మంచిర్యాల అర్బన్ : అల్ఫోర్స్ పాఠశాలలో సరస్వతీ మాతకు మొక్కుతున్న విద్యార్థులు

మంచిర్యాల టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని విశ్వనాథాలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదపండితులు వామనభట్ల బాలకృష్ణ, సంగనబట్ల నరహరిశర్మలే సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. అనంతరం వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు, భక్తులకు అల్పాహారం అందజేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి ముక్త రవి, అర్చకులు పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని బైపాస్ రోడ్‌లో గల అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో సరస్వతీ చిత్ర పటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు సరస్వతీ స్తోత్రమ్, సరస్వతీ అష్టోత్తరం ఆలపించారు. అనంతరం విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటా పాటలతో కూడిన విద్య నేర్పించడంతోపాటు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం అందిస్తున్నామంటూ టీచర్లు తెలిపారు. సంజీవయ్య కాలనీ టీచర్ అరుణ, ఏసీసీ-3 టీచర్ ఎన్ పద్మ, సహాయకులు లత పాల్గొన్నారు.

కోటపల్లి, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని ఉషోదయ పాఠశాల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించి చిన్నారులకు సామూహిక అక్షర్యాభ్యాసాలు చేయించారు. విద్యార్థుల సాంస్కృ తిక కార్యక్రమాలు అలరించాయి..

కన్నెపల్లి, ఫిబ్రవరి 14 : కన్నెపల్లి, ఎల్లారం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం వసంత పంచమి సందర్భంగా పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఇందిర పిల్లల చేత అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో టీచర్ సరిత, ఆయా విజయ, కన్నెపల్లి ఎంపీటీసీ నెండుగూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 14: రామకృష్ణాపూర్‌లోని శ్రీకోదండ రామాలయ ప్రాంగణంలోని సర్వతీ ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక తవక్కల్ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. 50 మంది చిన్నారులకు తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14 : శ్రీరాంపూర్ కాలనీలోని విశ్వశాంతి హైస్కూల్లో కరస్పాండెంట్ జక్కెన రమేశ్, ప్రిన్సిపాల్ మహేందర్ ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. వేద పండితులు విజయ్‌శర్మ సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల కు అక్షరాభ్యాసం చేయించారు.

శ్రీరాంపూర్ : విశ్వశాంతి హైస్కూల్లో వసంత పంచమి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామకృష్ణాపూర్ : అక్షరాభ్యాసం చేయిస్తున్న తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్

కోటపల్లి : సరస్వతీకి పూజలు చేస్తున్న ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు

త్రీ స్టార్ హోటల్ ఏర్పాటు అభినందనీయం

- డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలో త్రీ స్టార్ హోటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. బుధ వారం పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించిన హోటల్ నార్థిన్‌ను జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తందూరి కాంటి సెంటర్, అడ్వాన్స్డ్ చైనీస్, సౌత్ ఇండియన్ ఫుడ్స్, బర్గర్, ఇండియన్ అండ్ కాంటినెంటల్ రుచులు, ఇంటర్నేషనల్ వంటకాలు అందించడం అభినందనీయమన్నారు. అలాగే హోటల్‌లో సూట్ రూమ్స్, జిమ్, బ్యాంకెట్ హాల్, కాన్ఫరెన్స్ హాల్, కాఫీ షాప్, ఓపెన్ టెర్రాస్ లాంజ్, స్విమ్మింగ్ పూల్ తదితర సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, నల్లాల ఓదెలు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునందన్ రావు, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, నాయకులు నీలి శ్రీనివాస్, నల్ల మల్లయ్య, నిర్వాహకులు నల్ల శ్రీనివాస్, వొల్లేటి సీతారామయ్య, రాంపెల్లి వెంకట రమణా చారి, సురేష్ కుమార్ మర్ద తదితరులు పాల్గొన్నారు.

త్రీ స్టార్ హోటల్‌ను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, జడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి

సాదాసీదాగా మండల సమావేశం

కోటపల్లి, ఫిబ్రవరి 14 : కోటపల్లి మండలం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ మంత్రి సురేఖ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగా, అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ సూచించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో సందడి కానరాలేదు. కోరం ఉండటంతో సమావేశాన్ని కొనసాగించారు. ఎంపీటీ సీలు చంద్రగిరి శంకరయ్య, శేఖర్, చేకుర్తి సంగీత, ఏవో మ హేందర్, పశువైద్యాధికారి పవన్ కుమార్, వైద్యాధికారి సత్య నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రినాథ్ స్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ మంత్రి సురేఖ

సమ్మెను విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 14 : కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్, మతతత్వ, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టు) మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాలలో నిర్వహించిన భవన నిర్మాణ రంగాల కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించ లేదన్నారు. చదువుల దేవయ్య, భీమయ్య, లక్ష్మణ్, పోచన్న పాల్గొన్నారు.

బుగ్గలో ఎమ్మెల్సీ, కలెక్టర్ దంపతుల పూజలు

ఎమ్మెల్సీ దండె విఠల్‌కు స్వాగతం పలుకుతున్న సభ్యులు

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని శ్రీబుగ్గరాజ రాజేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం రాతి ధ్వజస్తంభ ప్రతిష్టాపన కోసం నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ దంపతులను దేవాలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయ కమిటీ చైర్మన్ మాసాడిశ్రీదేవిశ్రీరాములు, సభ్యుల ఆహ్వానం మేరకు వారు బుగ్గ దేవాలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. కన్నాల సర్పంచ్ జిల్లపల్లి స్వరూప వెంకటస్వామి, దేవాదాయశాఖ అధికారి బాపిరెడ్డి ఉన్నారు.

రాతి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 14: కన్నాల శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ దాతలు సంకూరి రాజేశ్వరి,రాజేశ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాతి ప్రత్యక్ష ధ్వజస్తంభాన్ని వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. పాల్గొన్న కాంగ్రెస్ నాయకులను దేవాలయ కమిటీ ఘనంగా సన్మానించింది. దేవాలయ చైర్మన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు, అర్చకులు శ్రీరాంభట్ల వేణుగోపాల శాస్త్రి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచారకమిటీ జాయింట్ కన్వీనర్ నాథరి స్వామి, నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ,కాంగ్రెస్ నాయకులు జక్కుల శ్రీధర్, మండల ఉపాధ్యక్షులు సంకూరి శంకర్, యువజన కాంగ్రెస్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ బాలు యాదవ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు భావండ్ల పల్లి భరత్, నాయకులు ముత్తె భూమయ్య పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 14: మంచిర్యాల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగం, నీటిసరఫరా విభాగం, విద్యుత్ విభాగం, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. అంతకు ముందు నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేశ్‌లకు శాలువాలు కప్పి సన్మానించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి గోపాల్, ముఖ్య సలహాదారు రామగిరి బానేశ్, గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం పాల్గొన్నారు.

బాక్సింగ్ కేంద్రం ప్రారంభం

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాల ఆవరణలోని పాత డీవైఎస్‌వో కార్యాలయంలో బుధవారం బాక్సింగ్ కేంద్రాన్ని జిల్లా యువజన, క్రీడల అధికారి బొబ్బిలి శ్రీకాంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బాక్సింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి దుర్గా ప్రసాద్, కోచ్ చిలువేరు రాజేశ్ పాల్గొన్నారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

దండేపల్లి(లక్షెట్టిపేట), ఫిబ్రవరి 14 : నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. లక్షెట్టిపేట మండలం కొత్తూర్, పోతపెల్లి, చందారం గ్రామాల్లో పర్యటించారు. నర్సరీలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఎండకాలం వస్తున్నందున మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీవో, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

బియ్యం గోల్‌మాల్‌పై విచారణ

తాండూర్, ఫిబ్రవరి 14 : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బియ్యం పక్కదారి ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి సంబంధించిన సిబ్బంది రేచిని గ్రామ శివారులోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 42.50 క్వింటాళ్ల బియ్యాన్ని పాఠశాలకు తరలించే క్రమంలో గోల్‌మాల్ చేసేందుకు యత్నించారని పలు సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్‌లో విచారించగా పాఠశాల సిబ్బంది చిన్న ట్రాలీ తీసుకొని రావడంతో రెండు ట్రిప్పులలో బియ్యం తరలించాల్సి వచ్చిందన్నారు. ఈ ఆరోపణ గురించి తెలిసిన రెవెన్యూ అధికారులు వెంటనే విచారణ చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి వెళ్లి స్టాక్ రిజిస్టర్, మిగిలి ఉన్న స్టాకు వివ రాలను పరిశీలించారు. ఇట్టి ఘటనపై ఎలాంటి అవకతవకలు జరగలేదని, పాఠశాలలో సిబ్బందికి మధ్య ఉన్న ఆధిపత్య పోరు ఈ ఆరోపణలకు దారితీసినట్లు పేర్కొన్నారు.

పోచమ్మకు పూజలు


పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న అధికారులు, భక్తులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 14: సమ్మక్క జాతర నేథ్యంలో రామకృష్ణాపూర్ ఆర్కే1 ఏ సమీపంలోని పాలవాగు ఒడ్డున పోచమ్మ ఆలయంలో బోనా లు సమర్పించి ఘనంగా పూజలు నిర్వహించారు. పోచమ్మ దేవత పూజల అనంతరం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి గద్దెల అలంకరణ పనులను మందమర్రి ఏరియా జీఎం మనోహర్ ప్రారంభించారు. ఆర్కేపీ ఓసీ ప్రాజెక్ట్ అధికారి ఎం. గోవింద రావు, ఆర్కే1ఏ గని మేనేజర్ జయంత్‌కుమార్, కే.కే 5 గని సంక్షేమ అధికారి ఎం. కార్తీక్, నాయకులు, సలేంద్ర సత్య నారాయణ, మల్లేశ్, అక్బర్‌అలీ, పూజారి కనకయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

అధికారుల బాధ్యతల స్వీకరణ.. బదిలీలు

జన్నారం, ఫిబ్రవరి 14 : జన్నారం ఎంపీడీవోగా శశికళ బుధవారం బాధ్యలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన అరుణారాణి నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో ఆసిఫాబాద్ జిల్లా నుంచి వచ్చిన శశికళ బాధ్యతలు చేపట్టారు.

జన్నారం తహసీల్దార్‌గా

జన్నారం తహసీల్దార్‌గా రాజమనోహర్‌రెడ్డి బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వేణుగోపాల్ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా వెళ్లడంతో ఆయన స్థానంలో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

బదిలీ అయిన తహసీల్దార్‌కు సన్మానం

జన్నారం తహసీల్దార్‌గా పనిచేసి వేణుగోపాల్ మంచిర్యాల ఆర్డీవో కార్యా లయానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

హాజీపూర్ ఎంపీడీవోగా..

హాజీపూర్, ఫిబ్రవరి 14 : హాజీపూర్ మండల అభివృద్ధి అధికారిగా మధుసూదన్ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-యూ నుంచి బదిలీపై ఇక్కకి వచ్చారు. ప్రస్తుతం హాజీపూర్‌లో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ హై గుడిహత్నూర్ కు బదిలీ అయ్యారు.

హాజీపూర్ ఎస్ఐగా సురేశ్..

హాజీపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా గోపతి సురేశ్ బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. 2020 బ్యాచ్‌కు చెందిన సురేశ్ జగిత్యాల జిల్లా కోరుట్లలో ప్రొబిషన్ పూర్తి చేశారు. అనంతరం మెట్‌పల్లి డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, మంచిర్యాల జిల్లా కన్నెపల్లి, మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు కోటపల్లిలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఇటీవల హాజీపూర్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నరేశ్ రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు.

శ్రీరాంపూర్ ఎస్ఐగా..

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14 : శ్రీరాంపూర్ ఎస్ఐగా బదిలీపై వచ్చిన సంతోష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాంపూర్ ఎస్ఐగా పనిచేసిన రాజేశ్‌ను రామగుండం వీఆర్ డిపార్ట్‌మెంటుకు బదిలీ చేశారు.

నస్పూర్ తహసీల్దార్‌గా..

నస్పూర్ తహసీల్దార్‌గా శ్రీనివాస్ బుధవారం కార్యాలయంలో బాధ్య తలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వనజ జైపూర్ మండలానికి బదిలీపై వెళ్లారు. నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ నస్పూర్ మున్సిపాలిటీ, మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్ఐ మాంతయ్య తహసీల్దార్‌ను సత్కరించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న జన్నారం ఎంపీడీవో శశికళ

భీమారం తహసీల్దార్‌గా..

భీమారం, ఫిబ్రవరి 14 : భీమారం తహసీల్దార్‌గా సదానందం బాధ్యత లు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన విశ్వంబర్ జగిత్యాలకు బదిలీపై వెళ్లగా, వేమనపల్లి నుంచి సదానందం ఇక్కడికి వచ్చారు.

బెల్లంపల్లి ఎంపీడీవోగా..

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 14: బెల్లంపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆర్.మహేందర్ బాధ్యతలు చేపట్టనున్నారు. బెల్లంపల్లిలో పని చేసిన రాజేందర్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆసిఫాబాద్ జి ల్లాలో పని చేస్తున్న మహేందర్ బెల్లంపల్లి ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు.

తాండూర్ తహసీల్దార్‌గా..

తాండూర్, ఫిబ్రవరి 14 : తాండూర్ తహసీల్దార్‌గా ఇమ్రాన్‌ఖాన్ నియమితులయ్యారు. నెన్నెల తహసీల్దారుగా పనిచేసిన ఇమ్రాన్ ఖాన్ తాండూరు మండల తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రోహిత్ దేశ్ పాండేను ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

మంచిర్యాల డీవైఎస్‌వో బదిలీ..

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 14 : మంచిర్యాల జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్‌వో) బొబ్బిలి శ్రీకాంత్ రెడ్డి కరీంనగర్ జిల్లాకు బుధ వారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంచిర్యాలకు కరీంనగర్ డీవైఎస్‌వో కే రజ్వీరును బదిలీ చేశారు. బుధవారం మంచిర్యాల డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి కరీంనగర్‌లో రిపోర్టు చేశారు.

నస్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా..

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14 :నస్పూర్ మున్సిపాలిటీ కమిషనర్ టీ రమేశ్‌ను బదిలీ చేశారు. నూతన కమిషనర్‌గా రంగారెడ్డి జిల్లా అమంగల్ మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సీహెచ్ సతీష్ బదిలీపై వస్తున్నారు.

కాసిపేట, ఫిబ్రవరి 14 : కాసిపేట ఎంపీడీవోగా సత్యనారాయణ సింగ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

ఉపాధికి భరోసా ఓరియంట్ కంపెనీ

ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి మేలు చేస్తుందంటున్న అధికారులు

కాసిపేట, ఫిబ్రవరి 14 : 1980లో ఓరియంట్ సిమెంట్ కంపెనీ స్థాపించారని, 1983లో ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కల్పిస్తుందని ఓరియంట్ కంపెనీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సిమెంట్ తయారీలో దేశంలో 70 స్థానంలో, అత్యుత్తమ కంపెనీలో 25వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. కంపెనీలో మూడో తరానికి కూడా వారసత్వ ఉద్యోగాలు లభిస్తున్నాయని, డిప్లొమా, ఇంజినీరింగ్ చదివిన పిల్లలకు అప్రెంటిస్ శిక్షణ ఇవ్వడం వల్ల దేశంలోని వివిధ పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. కంపెనీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాల వేలాది మంది భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిందని, ఇక్కడ చదువుకున్న అనేక మంది విద్యార్థులు దేశవిదేశాల్లో స్థిరపడ్డారని వివరించారు. ఇటీవల పాఠశాలలో ప్రముఖ డీఏవీ ద్వారా డిజిటల్ పద్ధతిలో బోధించే సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో 40 కంప్యూటర్లతో ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు, అతి త్వరలో పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్‌ను అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. పరిసర గ్రామాలకు మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్య సేవలను కార్పొరేట్ సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వనవాసి కళ్యాణ్ ఆశ్రమంలాంటి వారికి నిత్య ఆహారవసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ప్రధాన మంత్రి సహాయ నిధికి విరాళమందించామని, గ్రామస్తులకు అన్ని రకాల సహాయం చేశామని, కొవిడ్ సమయంలోనూ కార్మికులకు వేతనాలు అందించినట్లు తెలిపారు. డీఎంఎఫ్‌టీ నిధులను గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వానికి అందిస్తున్నామని, రోడ్డు, బోర్లు, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతను ఓరియంట్ సిమెంట్ కంపెనీ పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ

నేడు మైనింగ్ లీజుపై ప్రజాభిప్రాయ సేకరణ

దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీకి సంబంధించి మైనింగ్ లీజు కోసం గురువారం నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఈవీఎంలు తనిఖీ చేసిన కలెక్టర్

నస్పూర్,ఫిబ్రవరి 14 : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఎల్క్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని ఈవీఎం గోదాములో కొనసాగుతున్న ఈవీఎం మొదటి దశ తనిఖీని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పది రోజులుగా ఈవీఎంల తనిఖీ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 1074 బ్యాలెట్ యూనిట్‌లు, 963 కంట్రోల్ యూనిట్‌లు, 1018 వీవీప్యాట్‌లు అందుబాటులో ఉండగా, మొదటి దశ తనిఖీలో 1063 బ్యాలెట్ యూనిట్‌లు, 960 కంట్రోల్ యూనిట్‌లు, 1079 వీవీ ప్యాట్‌లను పరీక్షించి సక్రమంగా ఉన్నాయని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

66 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 14 : అక్రమంగా రవాణా చేస్తున్న 66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు సివిల్ సప్లయ్స్ డీటీ మధుసూదన్ రెడ్డి బుధ వారం తెలిపారు. జిల్లాలోని కోటపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో టాస్క్ ఫోర్సు సిబ్బంది మాటు వేసి రెండు బొలెరో వాహనాల్లో 150 బస్తాలలో తరలిస్తున్న 66 క్వింటాళ్ల అక్రమ పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బుధ వారం పంచనామా చేసి బియ్యాన్ని చెన్నూర్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపరిచామని, వాహనాలను చెన్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్సు టీం హెడ్ సుదర్శన్ రెడ్డి బృందం తదితరులు పాల్గొన్నారు.